# రెయిన్‌గన్ల మంత్రదండంతో కరువు పారిపోయిందా?!

**రాష్ట్రంలో** సాగునీటి రాజకీయాలు ముమ్మర మైనాయి. పాలక, ప్రతిపక్ష పార్టీల పరస్పర ఆరోపణలు కొనసాగుతున్నాయి. సాగునీటి సమస్య పరిష్కారానికి సరైన విధానాలు అనుసరించని ప్రభుత్వం, అందుకోసం ఆందోళన చేయని ప్రతిపక్షం సాగునీటి సమస్యను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగంచుకొంటున్నాయి. రాష్ట్రంలో మూడువందలపైగా మండలాలు దుర్భిక్ష పరిస్థితుల్లో వుంటే అసలు కరువే లేనట్లు మొదట ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవహరిచాడు. కరువుని గాలికి వదలి పుష్కరాల్లో మునిగి తేలాడు. తీవ్ర విమర్శల మధ్యకరువు వున్న పరిస్థితిని అంగీకరించి రెయిన్‌గన్ల ద్వారా పైర్లను కాపాడతానని రెయిన్‌గన్ల ప్రచారాన్ని ముందుకు తెచ్చి సాగునీటి సమస్య పరిష్కారమైనట్లు ప్రకటించారు.

| ప్రాజెక్టుల క్రింద ఆయకట్టు భూమి-సాగైన భూమి | | |
|---|---|---|
| **జలాశయాలు-నీటి ఆధారం** | **ప్రతిపాదిత ఆయకట్టు (లక్షల ఎకరాల్లో)** | **సాగుచేసిన ఆయకట్టు (లక్షల ఎకరాల్లో)** |
| భారీ, మధ్యతరహా వనరులు | 66.22 | 26.01 |
| చిన్న నీటి వనరులు | 16.12 | 8.54 |
| నీటి పారుదల అభివృద్ధి సంస్థ పథకాలు | 5.50 | 2.70 |
| భూగర్భ జల వనరులు | 24.12 | 23.44 |

**ఆధారం : ఈనాడు 2-9-2016**

ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు సాగునీటి విడుదలపై రైతులకు ప్రభుత్వం ఆశలు కల్పించింది. పట్టిసీమ ఎత్తిపోతల పథకంద్వారా గోదావరి నీటిని కృష్ణకు మళ్లించి జూన్ 15 కల్లా కాల్వలకు విడుదల చేస్తామని సాగునీటి మంత్రి ప్రకటించాడు. దానికితోడు జూన్‌లో ఆశించినమేర వర్షాలు పడ్డాయి. ఖరీఫ్ పంటపై రైతులు ఎన్నో ఆశలు పెట్టుకొన్నారు. రాయలసీమలో ప్రధాన పంట వేరుశనగ జూన్‌లోనే 58 శాతం, మిగిలింది జులైలో సాగుచేశారు. సాగునీరు లభిస్తుందనే ఆశతో ప్రకాశం బ్యారేజ్ కుడి, ఎడమ కాల్వలకు సాగునీరు విడుదల కాకపోయినా బోర్ల క్రింద నారు మళ్లుపోయటం, మిషన్లద్వారా వరి విత్తనాలు ఎదబెట్టటం జరిగింది. జులై చివరివారం నుండి ఆగస్టు చివరి వరకు వర్షాభావ పరిస్థితి తీవ్రంగా ఏర్పడింది. 21.55 లక్షల ఎకరాల్లో వేసిన వేరుశనగ పైరు నీరులేక ఎండు ముఖంపట్టి ఆగస్టు 18 నాటికి 12.43 లక్షల ఎకరాల్లో పూర్తిగా ఎండిపోయింది. క్రమంగా అది 17.53 లక్షలకు చేరింది. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఎదపెట్టిన విత్తనాలు, నారుమళ్లు ఎండిపోవటం ప్రారంభమైంది. అత్యధిక రైతులు మోటారు బోర్లద్వారా వేలాది రూపాయలు ఖర్చుచేసి నాట్లువేసినా భూగర్భ జలాల నీటిమట్టం పడిపోయి వేసిన పైర్లు ఎండిపోయే పరిస్థితి వచ్చింది. బ్యారేజీ నీటిని సాగుకి విడుదల చేయకపోవటం, పట్టిసీమ ద్వారా కాల్వలకు అవసరమైన నీరు విడుదలకాకపోవటం అందుకు కారణం. ప్రాజెక్టుల నీరు సాగుకి ప్రాధాన్యత ఇవ్వకుండా విద్యుత్తు ఉత్పత్తికి, పరిశ్రమలకు విడుదల చేయటం పాలకులు ప్రధానంగా పెట్టుకొన్నారు. దుర్భిక్షానికి తోడు పాలకుల సాగునీటి విధానం పంటలు ఎండి పోవటానికి కారణమైంది. లక్షలాది ఎకరాల్లో సేద్యం జరగలేదు.

రోమ్ నగరం తగలబడుతుంటే చక్రవర్తి పిడేల్ వాయించుకొంటున్నట్లు, రాష్ట్రంలో మూడువందలకు పైగా మండలాల్లో కరువు పరిస్థితులు ఏర్పడితే అదేమి పట్టనట్లు పుష్కరాల ప్రాముఖ్యతను వివరిస్తూ చంద్రబాబునాయుడు పుష్కరరాగం ఆలపించాడు. తీవ్ర విమర్శలు వెల్లువెత్తినా ఏమీ పట్టనట్లు పుష్కరాలు పూర్తిఅయిన ఐదోరోజు తాపీగా కరువు వుందా, లేదా అన్న దాన్ని పరిశీలించటానికి అనంతపురం, చిత్తూరు జిల్లాలు పర్యటించాడు. కరువు తీవ్రత కళ్ళముందు ప్రత్యక్షమయ్యేసరికి తన వైఫల్యాన్ని కప్పిపుచ్చు కొనేందుకు రెయిన్‌గన్లద్వారా సాగునీరు అందిస్తానని, పంటలను కాపాడతానని రైతులను మభ్యపెట్ట చూశారు.

రెయిన్‌గన్లలు అందించినా, వాటిని నింపేందుకు నీరు ఎక్కడ వుందని అనేక ప్రశ్నలు ముందుకు వచ్చాయి. అప్పటికే 17 లక్షల ఎకరాల్లో వేరుశనగ ఎండిపోయింది. మిగిలింది 4.69 లక్షల ఎకరాలు. ముఖ్యమంత్రి రెయిన్‌గన్ల ప్రచారాన్ని ముందుకు తెచ్చిన నాలుగైదు రోజుల్లోనే రాయలసీమతోపాటు రాష్ట్రంలో వర్షాలు ప్రారంభమైనాయి. కొనప్రాణంతో కొట్టుమిట్టాడుతున్న పైర్లకు ప్రాణం పోసింది. కృష్ణా డెల్టాతోపాటు ఇతర ప్రాంతాల్లో కూడా వేసిన వరిపైరు తెప్పరిల్లుకోవటమే కాకుండా నాట్లు పడని పొలాల్లో నాట్లు వేశారు. వర్షపునీరు, భూగర్భజలాల నీరు ఇందుకు దోహదమైంది. ఈ వాస్తవాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు కప్పిపెడుతూ, రెయిన్‌గన్ల ద్వారా పైర్లను కాపాడానని, రాయలసీమలోనే 4.69 లక్షల ఎకరాల వేరుశనగ పంటను కాపాడిన ఘనత తనదేనని, కరువును పారద్రోలానని గొప్పగా ప్రకటించుకొన్నాడు.

అంతర్జాతీయ లెక్కల ప్రకారం ఒక టిఎంసి (2,831.68 కోట్ల లీటర్లు) నీటి సరఫరాకు పదివేల లీటర్ల సామర్థ్యంగల ట్యాంకర్లు 28.31 లక్షలు కావాలి 4.69 లక్షల ఎకరాల్లో ఒక తడికి నీరు అందించటానికి 10 టిఎంసీల నీరు కావాలి. ఇంత నీటిని

నింపటానికి 2.83 కోట్ల ట్రిప్పుల ట్యాంకర్లు కావాలి. రెయిన్‌గన్ల ద్వారా పంటలకు నీరు అందించటానికి అనంతపురానికి ముఖ్యమంత్రి పంపిన ట్యాంకర్లు వెయ్యి. ఇవి కూడా ఆగస్టు 30 నుండి సెప్టెంబరు 2 వరకు మాత్రమే వున్నాయి. రాయలసీమలోని మిగతా జిల్లాలన్నింటిలో వెయ్యి ట్యాంకర్లు కూడా లేవు. ట్యాంకర్లకు సరిపడా నాలుగు రోజుల్లో 10 టిఎంసీల నీరు అందించే అవకాశం రాయలసీమలో వుందా? ఇదంతా గమనించి నప్పుడు ఎండిపోగా మిగిలిన పంట వర్షాలవలనే జీవం పోసుకుందనే వాస్తవాన్ని ముఖ్యమంత్రి ఉద్దేశ పూర్వకంగానే మరుగుపరుస్తున్నాడు. రెయిన్‌గన్లకోసం 160 కోట్లు ఖర్చుపెట్టిన ముఖ్యమంత్రి ఆ డబ్బుతో హంద్రీ-నీవా ప్రాజెక్టు పనులు ఎందుకు చేపట్టలేదు? అది పూర్తయితే రాయలసీమకు సాగునీరు అందించవచ్చు. అందుకు చంద్రబాబు ప్రభుత్వం ఎందుకు ముందుకు రావటంలేదు?

పట్టిసీమ ఎత్తిపోతల పథకం, రెయిన్‌గన్‌ల ద్వారా రాష్ట్రంలో కరువును పారద్రోలి 81 లక్షల ఎకరాల్లో సేద్యం జరిగేటట్లు చేసిన ఘనత తన ప్రభుత్వానిదేనని ముఖ్యమంత్రి తనకు తానే భట్రాజు పొగడ్తలు చేసుకొంటున్నాడు. ఇదీ వాస్తవ విరుద్ధమే. లక్షలాది ఎకరాలు ఇంకా రాష్ట్రంలో సాగుకావలసి వుంది. భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల క్రింద ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలోని 13 జిల్లాల్లో 66.22 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించాలని జలవనరులశాఖ ప్రణాళిక రూపొందించినా, ఇప్పటివరకు 26.01 లక్షల ఎకరాల ఆయకట్టు మాత్రమే సాగైంది. నాగార్జునసాగర్ కుడికాల్వకు నీరు అందించటం సాధ్యంకాదని చెప్పి, ప్రస్తుతం ఆరుతడి పంటలకే నీరు అంటుంది ప్రభుత్వం. వివిధ ప్రాజెక్టుల క్రింద వున్న ఆయకట్టు భూమి, సాగైన భూమి వివరాలు పై **పట్టికలో** చూపినవిధంగా వున్నాయి.

జల వనరులశాఖ రూపొందించిన సాగునీటి ప్రణాళికలో భూగర్భ జలవనరుల లక్ష్యమే అత్యధికంగా విజయవంతమైంది. సాగునీటి ప్రాజెక్టుల లక్ష్యంలో సగం కూడా సాగునీరు అందించలేకపోయాయి.

ఇప్పటికే రాయలసీమలో వేరుశనగ 17.53 లక్షలు ఎకరాల్లో ఎండిపోయింది. తిరిగి ఇప్పుడు విత్తనాలు వేసినా ఉపయోగంలేదు. ప్రకాశం బ్యారేజ్ కుడి, ఎడమ కాల్వలక్రింద లక్షలాది ఎకరాల్లో వరిపైరు ఎండిపోయి, తిరిగి వెయ్యటం జరిగింది. ఉభయ గోదావరులు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో పైర్లకు నష్టం జరిగింది. ఇప్పటికే ఇంకా లక్షలాది ఎకరాల్లో పైర్లు వేయాల్సి వుంది. ఈ నెలలో కురిసిన వర్షాలు పైర్లకు జీవంపోసినా, నెల్లూరు, శ్రీకాకుళం, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో లోటు వర్షపాతమే నమోదు అయింది. నెలాఖరులోగా నైరుతీ రుతుపవనాలు నిష్క్రమించనున్నాయి. వచ్చే నెలలో సాగునీరు అందటంపైనే పైర్ల పెరుగుదల ఆధారపడి వుంది. వర్షాలు కనుమరుగైతే నీరులేక పైర్లు ఎండిపోయే ప్రమాదం పొంచి వుంది. ఈ నెలలో కురిసిన వర్షాలు, వర్షపాతం చెప్పుకోవటానికి ఉపయోగపడుతుంది తప్ప ఉపయోగం వుండదు. అలాంటి సందర్భములో ప్రభుత్వం బ్యారేజీల్లో వున్న నీటిని సాగుకి విడుదల చేస్తేనే పంట పైర్లు రక్షించ బడతాయి. ప్రభుత్వం అలా చేస్తుందనే నమ్మకం లేదు. సాగునీటికి ప్రాధాన్యత ఇవ్వకపోవటమే అందుకు కారణం. తుంపర, బిందు, ప్రకృతి సేద్యం చేయమని, అదే రైతులకు లాభసాటని ముఖ్యమంత్రి రైతులకు హితబోధ చేయటం, సాగునీరు అందించటంలో ఆయన ఉద్దేశ్యం వెల్లడౌతున్నది. వరి మొదలైన ఆహార పంటలకు ఎక్కువ నీరు అవసరం కాబట్టి ఆ పంటలు వేయవద్దని పరోక్షంగా చెప్పటమే. ఇది ప్రపంచబ్యాంక్ సూచనల మేరకే అన్నది గమనించాలి.

రాష్ట్రంలో కరువు పారద్రోలుతానని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పే మాటలు వాస్తవాన్ని చూడ నిరాకరించటమే. 30 లక్షలకు పైగా ఎకరాల్లో పైర్లు ఎండిపోయాయి. లక్షలాది ఎకరాల్లో సేద్యమే జరగలేదు. పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. వర్షాలు కనుమరుగైతే పరిస్థితి ప్రశ్నార్థకంగా మారనుంది. అనావృష్టి-యంత్రాల వినియోగంవలన వ్యవసాయ పనులు దొరక్కపోవటంతో గ్రామీణ పేదలకు ఉపాధి దొరక్క పెద్దఎత్తున వలసలు పోతున్నారు. వీటన్నిటినీ గమనిస్తే రాష్ట్రానికి కరువు ప్రమాదం పొంచే వుంది. కరువుని పారద్రోలుతానని చెప్పటమంటే, అందుకు సహాయక చర్యలు చేపట్టనని చెప్పటమే.

ప్రతిపక్ష వైయస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ సాగునీటి సమస్యపై విమర్శల వరకే పరిమితమై రాజకీయ లబ్ధిపొందేందుకు చూస్తున్నది తప్ప, ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, ఎత్తిపోతల పథకాలు, చెరువుల మరమ్మత్తులు, చెక్‌డ్యామ్‌లు నిర్మించి వర్షం, వరదల నీరు నిల్వచేయాలనే డిమాండ్లతో ఉద్యమాలు చేపట్టటం లేదు. సాగునీటి సమస్య ఎడల పాలక-ప్రతిపక్ష పార్టీల వైఖరిలో పెద్ద తేడాలు లేకపోవటమే అందుకు కారణం.

రైతాంగం, ప్రజలు, పాలకుల సాగునీటి విధానాలను అర్ధంచేసుకోవాలి. రెయిన్‌గన్లు కాదు- రిజర్వాయర్లు, ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలు నిర్మించాలని, ప్రాజెక్టుల నీటిని ముందుగా సాగునీటికి ప్రాధాన్యత ఇవ్వాలని, పైర్లు నష్టపోయిన రైతులకు పూర్తి పరిహారం చెల్లించాలని, ఎరువుల సబ్సిడీని రెట్టింపు చేయాలని, కరువు ప్రమాదాన్ని గుర్తించి అందుకు చర్యలు తీసుకోవాలని రైతులతోపాటు గ్రామీణ ప్రజలందరూ ఉద్యమించాలి.

ooooo